క్లుప్తంగా

మహాసభలకు తరలిన నాయకులు

భూపాలపల్లి అర్బన్: సంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలకు జిల్లా ప్రతినిధులు శనివారం తరలి వెళ్లినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు తెలిపారు. ఈ నెల 28న వరకు నిర్వహించే మహాసభల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. నాయకులు రమేశ్, రాజేందర్, దేవేందర్, రాజయ్య, శ్రీకాంత్, ప్రీతి, పద్మ, చిన్న రాజేందర్ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిదిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మలాపూర్ శివారులో పేకాట ఆడుతుండగా తొమ్మిది మంది వ్యక్తుల నుంచి 9 సెల్ ఫోన్స్, నాలుగు ద్విచక్రవాహనాలతో పాటు రూ.97,350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పుల్లూరి అరుణ్ (బావుసింగ్‌పల్లి), తాటికాటి ప్రవీన్ (గోపాలపూర్), కావటి రవీందర్(జూకల్), ఏరుకొండ రాజేశ్ (ఆత్మకూర్), చేర్ల మధు(హనుమకొండ), గోల్కొండ కుమారస్వామి(తిర్మలాపూర్), పుట్టపాక మహేందర్(జూకల్), రమేశ్(రేపాక), మన్నెం శ్రీనివాస్ (తిర్మలాపూర్)లను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఎక్కడైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

నియామకం


రమేశ్‌రెడ్డి, అధ్యక్షుడు


చంద్రమౌళి, వర్కింగ్ ప్రెసిడెంట్

ములుగు: ములుగు మండల బీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ సమితి, తాత్కాలిక మండల అధ్యక్షుడిగా దేవగిరిపట్నం గ్రామానికి చెందిన సానికొమ్ము రమేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అబ్బాపూర్ గ్రామానికి చెందిన ఆకుతోట చంద్రమౌళిని నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి శనివారం పేర్కొన్నారు. ప్రస్తుతం మండల అధ్యక్షుడిగా ఉన్న పాలెపు శ్రీనివాస్‌ను నూతన మల్లంపల్లి మండల ఎన్నికల సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగించనున్నట్లు తెలిపారు.

ప్రశంస పత్రాల అందజేత

వాజేడు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వాజేడుకు చెందిన కావిరి బాల చంద్రమూర్తి, దేవ కుమారికి ఉత్తమ బూత్ లెవెల్ ఆఫీసర్లుగా, ఉత్తమ ఎలక్షన్ సూపర్ వైజర్‌గా కుందమల్ల నాగరాజులకు శనివారం ప్రశంస పత్రాలను అందించారు. తెలంగాణ చీఫ్ ఎన్నికల అధికారి నుంచి ప్రశంస పత్రాలు రాగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ అందించారు.

పరామర్శ

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగిరెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పరామర్శించారు. కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, పులుగుజ్జు వెంకన్న, చింత క్రాంతి, లింగా రెడ్డి, యాదగిరి రెడ్డి, జక్కు రణదీప్, గొంది కిరణ్, దేవరపెల్లి మల్లారెడ్డి, సామ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

‘గురుకులం’ పిలుస్తోంది..



ఎంజేపీ పాఠశాల

5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలు
- ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తుల స్వీకరణ, 23న ప్రవేశ పరీక్ష

మొగుళ్లపల్లి: గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరం ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 5 నుంచి 9వ తరగతి వరకు చేరే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది నుంచి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ముందే సమర్పించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో 5వ తరగతికి ఒకసారి, 6 నుంచి 9వ తరగతులకు మరోసారి దరఖాస్తులను స్వీకరించేవారు. అర్హత పరీక్షలు సైతం వేర్వేరు తేదీల్లో నిర్వహించేవారు. ఈ ఏడాది నుంచి అందరికి ఒకేసారి దరఖాస్తులను స్వీకరణ, అర్హత పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు గురుకులాలు ఉన్నాయి. ఒక్కో గురుకులంలో 80 సీట్లు ఉంటాయి.

ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

గత సవత్సరం డిసెంబర్ 21 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనోఫైడ్ లేదా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతోపాటు మొబైల్ నంబర్ (ఓటీపీతో లాగిన్ అవ్వాలి) విద్యార్థి పాస్ ఫొటో దరఖాస్తు సమయంలో అవసరం ఉంటుంది. అలాగే గ్రామీణ ప్రజల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు ఉండాలి. పట్టణ ప్రజల వార్షిక ఆదాయం రూ.2 లక్షలలోపు మాత్రమే ఉండాలి.

సద్వినియోగం చేసుకోవాలి



గురుకులాల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలి. అన్ని పత్రాలతో మీ సేవ కేంద్రాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

– ఎస్ శారద, ఎంజేపీ ప్రిన్సిపాల్, మొగుళ్లపల్లి

యుద్ధభేరిని విజయవంతం చేయాలి


అభివాదం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

భూపాలపల్లి రూరల్: వరంగల్‌లో ఫిబ్రవరి 2న నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు బడుగు బలహీన వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం తీన్మార్ మల్లన్నటీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్ని బీసీ సంఘాల నాయకులతో కలిసి బీసీ రాజకీయ యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు బీసీ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. బీసీలకు రావలసిన 42 శాతం రిజర్వేషన్ వచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్న బీసీ ఇంటలెక్చువల్ ఫోరం, ఇతర బీసీ సంఘాలు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, అఖిలేష్ యాదవ్ లాంటి పలు రాష్ట్రాల బీసీ నాయకులు కూడా యుద్ధభేరి సభకు వస్తున్నారని తెలిపారు. కావున జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున బీసీ ప్రజలు తరలిరావాలని కోరారు. బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

‘నిరుపేదలకు అండగా సీపీఐ’

శాయంపేట : నిరుపేదలకు సీపీఐ అండగా నిలుస్తోందని ఆ పార్టీ మండల కార్యదర్శి బత్తిని సదానందం అన్నారు. మాందారిపేట గ్రామశివారులో ప్రభుత్వ భూమిలో వేసుకున్న గుడిసెల వద్ద ఆయన మాట్లాడుతూ.. దున్నేవాడికే భూమి కావాలని పోరాటాలు చేసి లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంపిణీ చేసిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా హనుమకొండలోని హరిత హోటల్‌లో ప్రారంభమైయ్యే ఉత్సవాలకు తరలిరావాలన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సమస్యలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్

టేకుమట్ల: గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ప్రజా సమస్యలు పేరుకుపోయాయని, బీఆర్ఎస్ నాయకుల అసత్య ప్రచారాలకు మండల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆనతి కాలంలోనే సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా కృషి చేస్తుందని అన్నారు. 10 సంవత్సరాలల్లో రేషన్ కార్డుల కోసం మాట్లాడని నాయకులు ఇప్పుడు రేషన్ కార్డుల కోసం ప్రజల పక్షాన మాట్లాడడంపై ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ప్రతీ లబ్దిదారుడికి సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాంపెల్లి వీరేశం, ఎడ్ల రమేశ్, స్పెషల్ ఐలయ్య, కొయ్యల చిరంజీవి, వంగ నరేష్, మంద రవి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సతీశ్‌గౌడ్

రైతుల బోర్లకు పర్మిషన్ ఇవ్వాలి

- రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వెంకట్‌రెడ్డి

గోవిందరావుపేట: రెవెన్యూ భూములలో రైతుల బోర్లకు పర్మిషన్ ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని పస్రా ఫారెస్ట్ కార్యాలయం ఎదుట శనివారం రైతులు ధర్నా చేసారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకుడు తుమ్మల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. 60 సంవత్సరాల నుంచి రైతులు రెవెన్యూ భూముల్లో కాస్తు కబ్జాలో ఉన్నారని అన్నారు. సర్వే నంబర్ 175లో 2200 ఎకరాలు, సర్వే నంబర్ 95లో 30 ఎకరాలు, సర్వే నంబర్ 41లో 183 ఎకరాలు రెవెన్యూ భూమి ఉందని అన్నారు. ఈ భూములలో ఏడో విడత భూ పంపిణీలో గతంలో ప్రభుత్వం అసైన్మెంట్ పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా సర్వే నంబర్ 175లో గత ప్రభుత్వం ఆధ్వర్యంలో ధరణి పట్టాలు వచ్చాయని అన్నారు. రైతులు పంటలు వేసుకొని గతంలోనే బోర్లు వేసుకొని వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ఆ బోర్ల రిపేరు కోసం, కొత్త బోర్లు వేయడం కోసం రైతులు బోరు బండ్లను తీసుకుపోతే పస్రా ఫారెస్ట్ ఎఫ్ఆర్‌ఓ బోర్ వేయకుండా అడ్డం తిరిగి రైతులను ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో మారపోయిన సారయ్య, పుప్పాల రాజన్న, గజ్జి ఎలేందర్, లకావత్ రాంచందర్, అంబాల మురళి, అన్నమయ్య, సల్లూరి రామకృష్ణ, బుర్రి వీరయ్య, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రైతులు

నవాబుపేటలో వైభవంగా చండీయాగం

చిట్యాల: మండలంలోని నవాబుపేట శివాలయంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చండీయాగం, కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు రఘునందన్‌శర్మ వేద మంత్రోచ్చరణలతో ఆలయం మార్మోగింది. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ కసిరెడ్డి సాయిసుధారత్నాకర్ పాల్గొన్నారు.


చండీయాగంలో పాల్గొన్న భక్తులు

ఓటు హక్కు అమూల్యమైంది


చిట్యాల: మండల కేంద్రంలో మానవహారం చేపట్టిన విద్యార్థులు


మొగుళ్లపల్లి: హై స్కూల్ ఆవరణలో..

- కాటారం తహసీల్దార్ నాగరాజు

కాటారం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో అమూల్యమైందని ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ నాగరాజు అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటర్ ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి అధికారులు, సిబ్బంది ర్యాలీ చేపట్టి ప్రధాన కూడలిలో విద్యార్థులతో కలిసి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాబు, నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ వెంకన్న, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బుర్ర రాజబాబుగౌడ్, అధ్యాపకులు యాకూబ్, స్వామి, తిరుపతి, సంపత్, విజయ, షఫీ పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

భూపాలపల్లి అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారావు తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఆవరణంలో ఓటరు అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అమూల్యమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యపకులు డాక్టర్ రుక్సానా, రామచంద్ర, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి తహసీల్దార్ హేమ ఓటు హక్కు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా వద్ద మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరునికి ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రఘుపతి, ఆర్ఐ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఏఎస్ఓ సాయికిరణ్, సీనియర్ అసిస్టెంట్ మోబిల్, రెవెన్యూ సిబ్బంది రాజ్‌కుమార్, శేషి , లక్ష్మీకాంత్, దేవేందర్, సమ్మయ్య, శివ, శ్రీను, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: జాతీయ ఓటరు దినోత్సవం మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించారు. మండల కేంద్రం తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాల, జూనియర్ కళాశాలలో, ఆయా గ్రామ పంచాయతీల్లో పంచాయతీ సిబ్బంది ఓటరు దినోత్సవ సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ..18 సంవత్సారాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు, మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్వో, సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులు, యువకులు, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వో, సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్వేత ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం వీధుల గుండా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్, డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రజాక్, ట్రైనీ ఎస్సై దివ్య, ఆర్ఐ నరేష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ స్పందన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ హుస్సేన్ మాట్లాడుతూ.. ఎలాంటి ప్రలోబాలకు లోగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


భూపాలపల్లి అర్బన్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు


మల్హర్: ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్


చిట్యాల: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు


టేకుమట్ల: రాఘవరెడ్డిపేటలో..


కాటారం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


మొగుళ్లపల్లిలో..

ఇళ్ల స్థలాలు దక్కేనా?

ప్రభుత్వ భూమిలో వెలసిన 879 గుడిసెలు
- 17 నెలలుగా గుడిసెల్లోనే నివాసం
- రహదారి, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కోసం వినతి

వాజేడు: గోదావరి వరదల సమయంలో ముంపునకు గురికావడం, ఇంటి జాగలేని నిరుపేదలు తమకు ఇంటి స్థలం కావాలని కోరుతూ.. మండల పరిధిలోని వాజేడు, పూసూరు గ్రామాల మధ్య ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలను వేశారు. 2023 సెప్టెంబర్ 11న సీపీఎం, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నిరుపేదలు గుడిసెలను వేసుకున్నారు. ఉన్న ఊరును వదిలి వచ్చి గుడిసెలను వేసుకుని నివాసం ఉంటున్నారు. గోదావరి ముంపు బాధితులు, ఉమ్మడి కుటుంబంలో ఉంటున్న వారు ప్రభుత్వ పరంగా ఇంటి స్థలం కావాలని కోరుతున్నారు.

879 గుడిసెలు

మండలంలోని 37 గ్రామాల నుంచి 879 కుటుంబాల వారు గుడిసెలను వేసుకున్నారు. వీరంతా తమకు ఇంటి స్థలంపై హక్కు కల్పించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో పాటు జిల్లా ఉన్నతాధికారులకు వినతి పత్రాలను అందజేశారు. కాని నేటి వరకు వారికి ప్రభుత్వ పరంగా ఎలాంటి హక్కు పత్రాలు లభించలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలాల కోసం గుడిసెవాసులు పోరాటం ప్రారంభించగానే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. దీంతో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమకు ఇంటి స్థలాలు దక్కుతాయని ఆశాభావంతో ఉన్నారు.

గుడిసెల్లోనే నివాసం

ఊర్లో సొంత ఇళ్లు లేకపోవడం, ఉన్నా ముంపు ప్రాంతంలో ఉండటం లాంటి కారణాలతో 17 నెలలుగా సుమారు 400 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. వీరిని ఖాళీ చేసి వెళ్లాలని అధికారులు పలుమార్లు హెచ్చరించారు. కాని వారు తమకు ఇళ్లు లేవని ఇంటి స్థలాలు కావాలని ప్రభుత్వం ఆదుకోవాలని గుడిసె వాసులు వేడుకుంటున్నారు. ఏ సౌకర్యాలు లేకుండా జీవనం సాగిస్తున్నామని, తాగు నీటికోసం తోగు కాలువ వద్ద చెలిమెలను తీసుకొని నీటిని తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. తమ గుడిసెల కాలనీకి రహదారి, తాగు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతి ఇవ్వడంతో పాటు తమ నుంచి ఇంటి పన్నులు కట్టించుకుని రశీదులు ఇవ్వాలని కోరుతున్నారు.


ప్రభుత్వ భూమిలో వేసిన గుడిసెలు


పాయబాటలకు చెందిన నాగేశ్వరరావు కుటుంబం


దూలాపురానికి చెందిన నాగరాజు కుటుంబం

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

వెంకటాపురం(కె): కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలోని వాడగూడెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన గుండారపు వెంకటేశ్వర్లు(46) కొంత కాలంగా అనారోగ్యంతో పాటు తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్నాడని తెలిపారు. కాగా వెంకటేశ్వర్లు భార్య అంజలి సైతం అనారోగ్య సమస్యలు ఏర్పడడంతో మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. దీంతో ఈ నెల 23న మండలకేంద్రంలోని తన కూతురు ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. బెస్తగూడెం గ్రామ శివారులోని రోడ్డు పక్కన ఉన్న అటవీ ప్రాంతంలో జీవితంపై విరక్తి చెంది ట్యా బ్లె ట్లు వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పా రు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు. వెంకటేశ్వర్లు ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థలాన్ని సిబ్బందితో కలిసి వెళ్లి వివరాలను సేకరించినట్లు ఎస్సై పేర్కొన్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనారోగ్యంతో వృద్ధుడు..

రేగొండ: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పెద్దంపల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దంపల్లి గ్రామానికి చెందిన బొద్దుల సదయ్య (60) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపంతో శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిపట్లు తెలిపారు. మృతుడి కూతురు సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

ఎన్నికల్లో గెలుపు కోసమే కాంగ్రెస్ ఎత్తుగడలు

శాయంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల జాబితా, గ్రామసభలకు తెరలేపిందని బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలను తమ వైపు తిప్పుకోవాలనే కుట్రతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ మాయమాటలు చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వనం దేవరాజ్, కడారి చంద్రమౌళి, రాజేష్, రాజశేఖర్, శ్రీకాంత్, సుధాకర్, సుమన్, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామకృష్ణ